ప్రజాశక్తి
సోమవారం 18 ఆగస్టు 2025
I
అల్లూరి సీతారామరాజు

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకొని అరకులోయ పోలీస్ స్టేషన్‌కు మూడు కొత్త బైకులను వచ్చాయని సి ఐ ఎల్.హిమగిరి, ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఆదివారం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పచ్చ జెండా ఊపి బైకులను స్థానిక సిఐ, ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కొత్తగా ఇచ్చిన బైకులు ట్రాఫిక్ నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్టిలో పెట్టుకొని విజిబుల్ పోలీసింగ్ ను చేపడతామన్నారు.మూడు కొత్త బైక్ లను అరకులోయ పోలీస్ స్టేషన్ కి ఇచ్చినందుకు జిల్లా ఎస్పికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

బైక్‌లు ప్రారంభిస్తున్న సిఐ హిమగిరి

నిర్వాసితులకు అండగా సిపిఎం

పోలవరం ముంపు, పునరావాస ప్రాంతాల్లో పర్యటించిన ఎంఎ.బేబీ, జాన్ బ్రిట్టాస్ బృందం

సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో పోరాడతామని భరోసా

చింతూరులో అమరవీరుల విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న ఎం.ఎ.బేబీ తదితరులు

గిరిజనులతో కలిసి ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేస్తున్న ఎం.ఎ.బేబీ

రామవరం బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ఎం.ఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్, లోకనాథం, తులసీదాస్, సురేంద్ర, కిరణ్ తదితరులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు శని, ఆదివారాల్లో అల్లూరి జిల్లా పోలవరం నిర్వాసిత మండలాల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, ఆ పార్టీ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ బృందం చేపట్టిన పర్యటన నిర్వాసితుల్లో కొండంత ధైర్యాన్ని నింపింది. సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా కడవరకూ పోరాడుతుందని నాయకులు చెప్పిన మాటలు భరోసానిచ్చాయి. తొలిరోజు దేవీపట్నం మండలంలో సాగిన సిపిఎం బృందం పర్యటన రెండో రోజైన ఆదివారం చింతూరు, విఆర్.పురం, ఎటపాక ప్రాంతాల్లో కొనసాగింది. ఎక్కడికక్కడ ఘన స్వాగతం లభించింది. పోలవరం నిర్వాసితుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్నామని, నిర్వాసితుల పోరాటానికి తమ పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఎం.ఎ.బేబీ అన్నారు. విఆర్.పురం మండలం రామవరంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను సిఎం చంద్రబాబు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల్లో ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలే దర్శనమిచ్చాయన్నారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత కాలనీలను సందర్శించి నిర్ఘాంత పోయానని తెలిపారు. కనీస మౌలిక వసతులు కల్పించలేదని వివరించారు. నిర్వాసితుల సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ నుంచి సారథ్యం వహిస్తున్న టిడిపి, వైసిపి ఎంపీలు పార్లమెంటులో ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. కేరళలో పునరావాస కాలనీల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా మోసగిస్తున్నాయో తెలిపారు. ఈ పర్యటనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, బి.తులసీదాస్, బలరాం, ఎఎస్ఆర్.రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్య : జాతీయ సమస్య

ఎటపాక: పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చెప్పుకుంటున్నప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్య కూడా జాతీయ సమస్య అవుతుందని కె.లోకనాథం అన్నారు. పోలవరం నిర్వాసిత కాలనీ నర్సింగపేటలో కాక అర్జున్ దొర అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పోలవరం కోసం సర్వస్వం త్యాగం చేసిన వాళ్ళ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, అందుకే ఈ సమస్యను జాతీయస్థాయిలో చర్చకు తీసుకువచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్‌లు పోలవరం ముంపు ప్రాంతంలో రెండు రోజులపాటు పర్యటించారని తెలిపారు. కాంటూరు లెక్కలు కాకి లెక్కలని అన్నారు. నిర్వాసితులందరికీ న్యాయం చేశాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. పునరావాస కాలనీలలో బతుకులు దుర్భరంగా ఉన్నాయన్నారు. అధికారులు, ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ప్రశ్నించి పోరాడకపోతే సమస్యలు పరిష్కారం కావన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి బొప్పెనకిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరావు, లోతా రామారావు, సున్నంరాజులు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మేకల నాగేశ్వరరావు, సీసం సురేష్, సంతోష్, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ పాల్గొన్నారు.

కాంటూరుతో సంబంధం లేకుండా ప్యాకేజీ ఇవ్వాలి

కూనవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మండలంలో ప్రతి ముంపు గ్రామం బాధితునికి ప్యాకేజీ వచ్చేలా చూడాలని సిపిఎం మండల ప్రజాప్రతినిధులు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఎటపాక మండలంలోని రాంగోపాలపురం గ్రామంలోని నిర్వాసిత కాలనీలో వారి పర్యటన సందర్భంగా ఆదివారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 56 గ్రామాలు ఉన్నాయని, అందులో పోలవరం ముంపునకు గురవుతున్న గ్రామాలు 46 అని తెలిపారు. అందులో శబరి పరీవాహక గ్రామాలు 17 అందులో భూమి ప్యాకేజీ వచ్చినవి 6 గ్రామాలని ఇంకా 11 గ్రామాలు మిగిలి ఉన్నాయన్నారు. గోదావరి పరీవాహక గ్రామాల్లో ముంపునకు గురవుతున్న గ్రామాలు 29 అని ఇంకా 3 గ్రామలు ఇవ్వాలన్నారు. 2006లో బొజ్జరాయిగూడెం గ్రామాన్ని మొదటి ప్రాధాన్య గ్రామంగా గుర్తించారని, క్రమంగా ఇంకో 9 గ్రామాలను గుర్తించడం జరిగిందని అన్నారు. బొజ్జరాయి గూడెం గ్రామానికి ఇచ్చిన ఆర్అండ్ఆర్ కాలనీలో 2022 గోదావరి వరదలకు మునిగిందని ఇలా ప్రభుత్వాలు ముంపు గ్రామాల ప్రజలతో ఆటలాడు తున్నారని వారు విమర్శించారు. అసలు కాంటూరుతో సంబంధం లేకుండా మునిగిన ప్రతి గ్రామానికి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపిటిసిలు అమ్మాజి, జయసుధ, సర్పంచ్‌లు నాగమణి, బొగ్గా వెంకమ్మ శంకర్ మడెంబాబు, కర్నాటి శ్రీనివాసరావు తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డోలు కొమ్ము నృత్యాలతో ఘన స్వాగతం

చింతూరు : సిపిఎం బృందానికి చింతూరులో ఘనస్వాగతం లభించింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యల ను జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేందుకు చేపట్టిన ర్యాలీ కార్యక్ర మం రెండో రోజు ఆదివారం జరిగింది. ఉదయం మారేడుమిల్లి నుంచి బయలుదేరి ఎర్రంపేట వద్దకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో ఎర్రం పేట వద్దకు చేరుకుని సాదర స్వాగతం పలికారు. కొమ్ముడోలు నృత్యాలతో సిపిఎం బృందానికి స్వాగతం లభించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ తలపై ఆదివాసి సంప్రదాయ కొమ్మును ధరించడంతోపాటు, గిరిజనులతో కలిసి సాంప్రదాయ నత్యంలో భాగస్వాములయ్యారు. అనంతరం చింతూరు సెంటర్ వద్ద అమర వీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పల్లపు వెంకట్, సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మడివి రవితేజ, పోడియం లక్ష్మణ్, కళాకారులు పట్టా రమేష్, పల్లపు రాములు పాల్గొన్నారు.

విఆర్‌పురం: చింతూరు మండలం నుండి విఆర్‌పురం మండలంలోని రామవరం గ్రామానికి కార్లతో ర్యాలీ నిర్వహించారు. రామవరం గ్రామస్తులు ఎం.ఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్, కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, సురేంద్ర, తులసీదాస్, జిల్లా కార్యదర్శి కిరణ్‌లతో కూడిన బృందానికి అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు లోతా రామారావు, సున్నంరాజులు, మర్లపాటి నాగేశ్వరరావు, మట్ల వాణిశ్రీ, ఎంపిపి కారం లక్ష్మి, పులి సంతోష్‌కుమార్, మేకల నాగేశ్వరరావు, సోయం చిన్నబాబు, సీసం సురేష్, పల్లపు వెంకట్, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లది రమేష్, పోడియం శ్రీరామ్మూర్తి, తోడం రాజు, పులి బుజ్జి పాల్గొన్నారు.

నర్సింగపేట సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

రామవరంలో పోలవరం నిర్వాసితుని సమస్యను తెలుసుకుంటున్న నాయకులు

తనకు నిర్వాసితులు బహూకరించిన మేక పిల్లతో ఎం.ఎ.బేబీ

డోలు వాయిస్తున్న ఎం.ఎ.బేబీ

మాట్లాడుతున్న జయ

గిరిజన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

- ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి.జయ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అల్లూరి సీతారామరాజు పాడేరు ఏజెన్సీ ప్రాంత గిరిజన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి.జయ తెలిపారు. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో ఈ ఉచిత బస్సు ఎంతో కీలకమైన పథకమని, అంగరంగ వైభవంగా ప్రారంభించారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో అనేక కారణాలు చెబుతూ స్త్రీలకి ఉచిత బస్సు సర్వీసు లేకుండా చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం ఇచ్చి, కేవలం గిరిజన ప్రాంత మహిళలకి ఉచిత బస్సు కల్పించకపోవడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం గిరిజన ప్రాంతం మహిళలకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు.ఉచిత బస్సులో మహిళలకు టికెట్ తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రెటరీ కె శశికళ, జిల్లా ఉపాధ్యక్షులు కుమారి,జిల్లా కమిటీ సభ్యులు సన్యాసమ్మ పాల్గొన్నారు.

చిన్నారుల మృతదేహాలు

ప్రాణాలు తీసిన ఈత సరదా

- నీటి కుంటలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట:: మండలంలోని మత్యపురం పంచాయతీ ఉప్పదిగవూరు- చెరుచింత గ్రామంలో ఇద్దరు చిన్నారులు ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది.ఆలస్యంగా అందిన వివరాల ప్రకారం, ఉప్పదిగవూరుకు చెందిన పాత్రుడు నాగేంద్ర కుమారుడు లిఖిత్ పాత్రుడు (3), చెరుచింత గ్రామానికి చెందిన తామర్ల వెంకటేష్ కుమారుడు హర్షవర్ధన్ (4) తల్లిదండ్రులతో పాటు పొలాలకు వెళ్లారు. కొంత సేపటి తరువాత పిల్లలను ఇళ్లకు వెళ్లమని పంపించారు. వారు మార్గమధ్యలో స్నేహితులతో కలిసి గ్రామానికి సమీపాన ఉన్న నీటి కుంటలో ఈతకు దిగారు. నీటి కుంట లోతు ఎక్కువగా ఉండడంతో చిన్నారులు బయటకు రాలేక మునిగి పోయారు. సాయంత్రం వరకు ఆచూకీ దొరకక పోవడంతో తల్లిదండ్రులు గ్రామమంతా వెతికారు. చివరికి ఇంటికి సమీపంలో ఉన్న నీటి కుంటలో మృతదేహాలు కనిపించాయి. వెంటనే గ్రామస్తులు పిల్లలను బయటకు తీసి ఉప్ప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు

▸▸పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు ▸▸ పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి -హుకుంపేట: హుకుంపేటలో ఆదివారం దయం 11 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసంది. వర్షపు నీటితో రహదారులు జలమయం అయ్యాయి. రహదారులు జలమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరి, అల్లం, రాగులు పంటలకు నష్టం వాటిల్లే అవకాశముందని రైతులు తెలిపారు. హుకుపేట మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు డ్రెయినేజీలో కలిసి ప్రవహిస్తుంది.

డుంబ్రిగుడ:మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా మండల కేంద్రంలోని వీధి కాలువలు, రోడ్లు వర్షపు నీటితో నిండి జలమయంగా మారాయి. వ్యవసాయం సాగు చేసే రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అనంతగిరి:మండలంలో ఎడతెరిపి లేకుండా కుండ పోత వర్షంతో గెడ్డలు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లుంగపర్తి, ఓనుకొండ, అనంతగిరి, డమ్ముకు, భీంపోలు, కాశీపట్నం, జిలుగులపాడు, కడరేవు, గెడ్డలు పొంగి పొర్లాయి. దీంతో ఓనుకొండ, నేలపాలెం, మలుంగుమ్మి, బీంపోలు గెడ్డ మీదుగా ప్రయణించె గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం, రాజుపాక, డెక్కపురం గ్రామాలకు రాకపోకలకు అంతరాయం నెలకొంది.

చింతపల్లి మండల రాజుపాకల వంతెన వద్ద ప్రవహిస్తున్న నీరు

చింతపల్లి:మన్యం ప్రాంతంలో ఆదివారం కురిసిన అతి భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో భాగంగా రాజుపాకాల, పెద్దగడ్డ వద్ద తాత్కాలికంగా నిర్మించిన వంతెన వరద నీటిలో మునిగి పోయింది. నీటి ఉధృతి పెరగడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

అనంతగిరి మండలం లంగుపర్తి వద్ద ప్రవహిస్తున్న గెడ్డ

హుకుంపేటలో కురుస్తున్న వర్షం

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని, అన్ని శాఖలు సమన్వయంతో లోతుట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాలోని జలవనరులు, రెవిన్యూ, పోలీసు,రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో మాట్లాడారు.కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దండోరా వేసి ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. నిత్యావసర సరుకుల పంపిణి పై ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు అప్రమత్తం అవసరమన్నారు. మత్స్యకారులు ఎవరు వేటకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ముంపుకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంత ప్రజలను ముఖ్యంగా గర్భవతులు, చిన్నారులు, వృద్ధులను వైద్య సహాయం నిమిత్తం పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ముందస్తు చేర్యలు చేపట్టాలన్నారు. రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ ఆఫీసర్స్, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, ప్రత్యేక ఉప కలెక్టర్లు, చింతూరు డివిజనల్ స్థాయి ఆదికారులు, వివిధ శాఖల అధికారులు సంబంధిత మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్లు ఉన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-పాడేరు:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 18వ తేదీన (సోమవారం) ఒకరోజు సెలవు ప్రకటించామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఒకరోజు పాఠశాలలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు కూడా ఈ నెల 18న సోమవారం జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు

జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలో కురుస్తున్న కుండపోత వర్షాల నేపథ్యంలో జలపాతాల వద్ద పర్యటకులు, స్థానికుల సందర్శనను నిషేధిస్తూ మండల రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వీరభద్రాచారి మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విపత్తు శాఖ హెచ్చరికతో మండలంలోని ఉన్న జీనబాడు పంచాయతీ సరియా, టోకురు పంచాయతీ. చిటంపాడు, బొర్రా పంచాయతీ కటికి, .అనంతగిరి పంచాయతీ తాడిగుడ, రాజుపాకలో బిసారంగని తదితర జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. సిఐటియు ప్రధాన కార్యదర్శి వి. ఉమ మహేశ్వరరావు సమక్షంలో సమావేశం జరిగింది. సిఐటియు మండల కన్వీనర్ గా జె. దీనబంధు, కో కన్వీనర్‌గా వి.మహేష్ తో13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా వి.అన్నపూర్ణ, కమిటీ సభ్యులుగా మోదకొండమ్మ, సత్యవతి, రత్నకుమారి, వెంకటమ్మ, దేవినాయుడు, లక్ష్మణ్, మత్స్యలింగం, ఈశ్వరమ్మ, వరహాలక్ష్మి, విజయ, ఈశ్వరి, సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ జె.దీనబంధు మాట్లాడుతూ, మండలంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులను కదిలించి పోరాటాల ద్వారా ఎండగడతామని తెలిపారు. పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

శిథిలమైన వంతెన

శిథిలావస్థలో వంతెన

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట, గడుగుపల్లి రహదారి మధ్యలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థలో ఉంది. ఈ మార్గం కామయ్యపేట నుంచి ఒడిశాకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సుమారు 40 సంవత్సరాలు అవుతుంది. బ్రిడ్జి పాడైపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా బ్రిడ్జి కూలి పోతుందేమోనన్న భయం స్థానికుల్లో నెలకొంది. ప్రమాదం సంభవించే ముందు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని కంద్రం పంచాయతీ కొరంజిగూడ, దండగుడ, సర్రాయు, ఉజ్జంగి గ్రామల్లో ఆదివారం స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కే హరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కొక్క రైతుకు 700 మొక్కల చొప్పున 99 మంది లబ్ధిదారులకు 86 ఎకరాల్లో మొక్కలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీటిని నాటుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, వార్డు సభ్యుడు పి.లచ్చన్న, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్ బి కళావతి ,గిరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చీడికాడ:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతు శ్రేయస్సుకు ఏర్పాటు చేశారని, వీటి ద్వారా ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ సూచించారు. చీడికాడ మండల కేంద్రం తులసి కళ్యాణ మండపంలో చీడికాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గవరెడ్డి జగన్నాథం, డైరెక్టర్లతో ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, సహకార సంఘాల్లో రైతులకు కొత్త సభ్యత్వాలు చేర్పించే అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే నగదు తోపాటు 7000 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.
మాజీ ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ, సిఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అందించడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, సొసైటీ సీఈఓ మజ్జి వరహాల దొర, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, మాజీ ఎంపీపీ కళావతి, కోనం జలాశయం మాజీ చైర్మన్ ముసలి నాయుడు, సర్పంచ్‌లు దాలినాయుడు, సూరినాయుడు, ఎంపీటీసీలు పెద్ది నాయుడు, కోటి పాల్గొన్నారు.

కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: కార్మికుల హక్కుల రక్షించుకోవడానికి సాధించుకున్న చట్టాలను కాపాడుకోవడం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని అందుకు కార్మిక వర్గం ఐక్యంగా ఉండాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పాడేరు మండలం సిఐటియ విస్తృత స్థాయి సమావేశం స్థానిక సిఐటియూ ఆఫీసులో కే.భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో తీవ్రమైన సమస్యలు కార్మికులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కై పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం పై వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. స్కీం వర్కర్లకు రకరకాల యాప్ పేరుతో తీవ్రమైన పని భారాన్ని పెంచేస్తుందని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ, మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తదితర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, ఉచిత బస్సు పథకం వలన రాష్ట్రంలో లక్షలాదిమంది ఆటో డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతారని, ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్‌లను విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. గిరిజన సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వేస్ కార్మికులను, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సిహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తగా మార్పు చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం, స్కూల్ స్వీపర్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శెట్టి నాగరాజు, మెడికల్ కాలేజ్ కాంట్రాక్ట వర్కర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత, పరసాద్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్యాలమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసమ్మ, ఏపీఎస్ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భరత్, గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాడేరు ప్రాజెక్ట్ కార్యదర్శి చిన్నరి,ఛాయాదేవి,సెక్యూరిటీ యూనియన్ నాయకులు బాలన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరావు

ఆర్థిక సాయం పెంచకుంటే మొండిగోడలే శరణ్యం

పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాల పరిశీలనలో చిన్నయ్యపడాల్

లబ్ధిదారులతో కలిసి ఇళ్లను పరిశీలిస్తున్న చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి.చింతపల్లి: పిఎం జన్‌మన్ గృహనిర్మాణాలకు ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థికసాయం ఎటూ సరిపోదని, వాటి పరిమితిని పెంచి సక్రమంగా చెల్లింపులు జరపకుంటే గిరిజన గ్రామాల్లో మొండిగోడలే మిగులుతాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ అభిప్రాయపడ్డారు. ఆదివారం సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవితో కలిసి లోతుగడ్డ పంచాయతీ తురుతంపాడు. గ్రామంలో పిఎం జన్‌మన్ గృహనిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, ఆరు నెలలుగా పిఎం జన్‌మన్ ఇళ్లకు బిల్లుల చెల్లింపులు లేవని రూ.25కోట్లు ప్రభుత్వం ఆపేసిన నేపథ్యంలో ఐటిడిఎ ఎదుట ఆందోళన చేయగా ఇపుడు నిధులు విడుదల చేసిందన్నారు. అయితే ప్రస్తుతం గృహనిర్మాణసామగ్రి ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం ఇచ్చే రూ.2.39లక్షలు ఎటూ సరిపోదని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.లక్షను శ్లాబ్ నిర్మాణం జరిగిన తర్వాత చెల్లిస్తామని మెలిక పెట్టడం సరికాదన్నారు.ఉపాధి హామీ పథకంలో మరో రూ.30వేలు చెల్లించాలన్నారు.
వీటన్నింటితో కలిపిన పిఎం జన్‌మన్ ఇళ్లకు ఇస్తున్న రూ.ఐదు లక్షలతో సక్రమంగా బిల్లులు చెల్లించినా ఇళ్ల నిర్మాణాలు సాధ్యం కాదని, గృహనిర్మాణ ఆర్థికసాయం పరిమితిని రూ.పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో 28 వేల మంది లబ్ధిదారులను గుర్తించి అందులో 20వేలమందికి మాత్రమే ఇల్లను మంజూరు చేశారని, మిగిలిన 8వేల మందికి కూడా పిఎం జన్‌మన్ గృహాలను మంజూరు చేయాలని కోరారు. పిపిటిజి గిరిజనులకు ఇచ్చే అంత్యోదయ కార్డులను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించడంతోపాటు అర్హులకు కొత్త కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు రమేష్, సుబ్బారావు, రవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : కొత్తగాజువాకలో ఆదివారం సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. కొత్త గాజువాకలో నివసిఉస్తున్న మొల్లేటి కృష్ణ ఆదివారం పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి పేలింది. దీంతో ఆయనతో పాటు అక్కడే ఉన్న భార్య లక్ష్మి, పాప శిరీషకు గాయాలయ్యాయి. ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి సిఐ పార్థసారథి చేరుకొని వివరాలను సేకరించారు. మరిన్ని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జివిఎంసి సంసిద్ధంగా ఉందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఇప్పటికే అప్రమత్తంతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టినట్లు తెలిపారు. కొండవాలు, లోతట్టు, మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేసినట్లు చెప్పారు. నగరంలో డ్రెయినేజీ లైన్లు, మ్యాన్ హోల్స్ , అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జివిఎంసి వాహనాలను, జనరేటర్లలను, చెట్లను తొలగించే యంత్రాలను, జెసిబిలను, ట్రక్కులను, ఇంధనాలను, సమాచార రేడియో హ్యాండ్ సెట్‌లు తదితర అవసరమైన పరికరాలను సిద్ధం చేయాలని, జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని రక్షణ చర్యలు దిశగా సిద్ధంగా ఉండాలని జివిఎంసి అధికారులకు, ఇంజినీర్లకు, జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఇప్పటికే ఆదేశాలు జారీ జారీ చేశారని తెలిపారు.

అత్యవసర సహాయ కేంద్రంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009ను సంప్రదించాలని సూచించారు. సమీపంలోని జోనల్ కార్యాలయాల్లోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జివిఎంసి అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యకు దళితుల డిమాండ్

ప్రజాశక్తి -తగరపువలస : శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళితులు భీమిలి మండలం తాళ్లవలసలో ఆదివారం నిరసన తెలిపారు. తాళ్లవలసలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్నిబాబు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే రవికుమార్ అతని సామాజిక వర్గానికి చెందిన మహిళను పొందూరు కెజిబివిలో ప్రిన్సిపల్‌గా నియమించుకునేందుకు దళిత మహిళా ప్రిన్సిపల్ సౌమ్యను వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సౌమ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పొందూరు మండలం నుంచి కంచిలి మండలానికి బదిలీ చేయడం సమంజసం కాదన్నారు. ప్రిన్సిపల్ సౌమ్యను యథావిధిగా పొందూరు కెజిబివిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎస్.రాంబాబు, వై.రామారావు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా కమిటీ ఆదేశాల మేరకు కంచరపాలెం జోన్‌లో ఈ నెల 15వ తేదీన విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ తరుణ్, సాయి తేజ, నాని, కుమార్, హాస్టల్ వార్డెన్, పిటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

19, 20న వైజాగ్ ఫొటో జర్నలిస్టుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :
వైజాగ్‌ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.రామకృష్ణ, ఎండి నవాజ్ తెలిపారు. బీచ్ రోడ్‌లో విశాఖ మ్యూజియంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ హాజరై ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా విశాఖ మ్యూజియం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత ప్రవేశం కల్పించామని, ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

దీక్ష విరమించిన సునీత

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో అంగన్వాడి కార్యకర్త నియామకంలో తనకు అన్యాయం జరిగిందని డిమాండ్ చేస్తూ 34 రోజులుగా అంబేద్కర్ విగ్రహం ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న మంత్రి సునీత ఆదివారం జనసేన కార్యకర్తల హామీతో దీక్ష విరమించారు. దీక్ష చేస్తున్న మంత్రి సునీతను ఆదివారం మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు జనసేన మండల శాఖ అధ్యక్షుడు బయలుపూడి రామదాసు, సీనియర్ నాయకుడు కరెడ్ల ప్రకాష్ దీక్షా శిబిరాన్ని సందర్శించారు. తనకు జరిగిన అన్యాయాన్ని వారి వద్ద సునీత మొర పెట్టుకుంది. ఎమ్మెల్యే హామీ మేరకు రానున్న రోజులలో మంత్రి సునీతకు న్యాయం చేస్తామని హామీ ఇస్తూ, నిమ్మరసం ఇచ్చి దీక్షన విరమింప చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -అనకాపల్లిరూరల్ : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆదివారం జివిఎంసి 83వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. లక్ష్మీదేవిపేట స్కూల్లో బిఎం చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో రోగులకు కంటి, గుండె, ఆర్థో సంబంధిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 82వ వార్డు టిడిపి ఇంచార్జి పోలారపు త్రినాథ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి స్థలాలు 'లూలూ'కు ఇవ్వొద్దు

జిఒ 137 రద్దు చేయాలి :ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: ఆర్‌టిసి స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ. 137 ను రద్దు చేయాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బాసూరు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణకు సంస్థలోని అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా రవాణా సంస్థ ఆర్‌టిసి ఆస్తులు ప్రైవేటు వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఆర్టీసి గవర్నర్ పేట- 1,2 డిపోలు, పాత బస్‌స్టాండ్‌కు చెందిన రూ.నాలుగు వందల కోట్ల విలువైన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. దశబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తూ, ఆ రెండు డిపోలలోని 200 బస్సులను 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తూ బడా వ్యాపారవేత్తలకు సంస్థ భూములను కట్టబెట్టే జిఒ137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గంగాలమ్మను దర్శించుకున్న రమాకుమారి

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మూలపేట గ్రామంలోని గంగాలమ్మ అమ్మవారిని యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమా కుమారి ఆదివారం దర్శించుకున్నారు. గతంలో అమ్మవారి గుడి నిర్మాణంలో విశాఖ డెయిరీ నుంచి రూ. 3 లక్షల నిధులను ఆలయ పెయింటింగ్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జోనల్ ఆఫీసర్ సరగడం రమణ, సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - పాయకరావుపేట : విశాఖలో ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పాయకరావుపేట కాంగ్రెస్ నేత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నలోని కాంగ్రెస్ కార్యాలయంలో కలసి, భట్టి విక్రమార్క, ఎఐసిసి సభ్యులు గిడుగు రుద్రరాజును సత్కరించారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ విస్తృత పోరాటం

సిడబ్ల్యూసి మెంబర్ గిడుగు రుద్రరాజు

మాట్లాడుతున్న సిడబ్ల్యూసి సభ్యుడు, పిసిసి మాజీ అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : బీహార్‌తో సహా పలు రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు ఓటర్ల జాబితాల్లో లేకుండా చేసిన చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విస్తత పోరాటం నిర్వహించడం జరుగుతుందని సిడబ్ల్యూసి సభ్యుడు, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఆదివారం కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై ఓట్‌చోర్ గద్దిచోడ్ అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చామన్నారు. విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మరాజు మాట్లాడుతూ తమ నాయకుడు రాహుల్‌గాంధీ మొదలుపెట్టిన ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, సమన్వయకర్తలు కె.వి సూర్యనారాయణ, దండి ప్రియాంక, సీనియర్ నాయకులు మహమ్మద్ అలీఖాన్,రజియా బేగం కస్తూరి వెంకటరావు, భాషా, పద్మిని, చంద్రశేఖర్, సబ్బవరపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబును విమర్శించే అర్హత వరుదు కల్యాణికి లేదు

మాట్లాడుతున్న జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : వరుదు కళ్యాణికి ముఖ్యమంత్రి చంద్రబాబుని విమర్శించే స్థాయిలేదని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు స్త్రీ శక్తి పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, స్త్రీ శక్తి పథకంలో ప్రకటించిన 5 బస్సుల్లో మాతో పాటు వస్తే మీకు ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్తామని ఎద్దేవా చేశారు.
వరుదు కల్యాణి మాటలు వెనక్కి తీసుకోవాలని, కూటమి ప్రభుత్వానికి, సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణగళ్ళ సత్యవతి మాట్లాడుతూ మహిళలపై దాడులు చేసింది వైసిపి ప్రభుత్వం ఈ రోజు విమర్శలు చేస్తున్న వైసిపి మహిళలు కాస్త వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. దక్షిణ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మి, గొలగాని సౌజన్య , రామలక్ష్మి పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకు పోరాటం

ఎపి అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి

ప్రజాశక్తి- సబ్బవరం : అంగన్వాడీల కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్రావతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారావు, రమణి అధ్యక్షతన అసోసియేషన్ పదోజిల్లా మహాసభలో మాట్లాడుతూ మాత శిశు మరణాలు నివారణకు, పిల్లలకు కౌమార విద్యను అందించేందుకు అంగన్వాడీ వర్కర్లు గ్రామాల్లో విశేషసేవలు అందిస్తున్నా, వారిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో 42 రోజులు సమ్మెచేస్తే, అప్పటో వేతనాలు పెంచుతామని, గ్రాడ్యుటీ చెల్లిస్తామని ఒప్పందం కుదిరినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేయకుండా ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. పదేళ్లుగా అంగన్వాడీలకు వేతన పెంపులేక, అరకొర వేతనాలతోనే వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు,నెట్‌వర్క్ పనిచేయకున్నా, రకరకాల యాప్‌లతో పనిభారాన్ని పెంచి ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, మాట్లాడుతూ నగదు బదిలీ పథకాల ద్వారా స్వచ్ఛంద సంస్థలకు ఐసిడిఎస్‌ను అప్పగించే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. లేబర్‌కోడ్స్‌తో కార్మిక హక్కులను, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్న కేంద్ర ప్రభుత్వ చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వివి రమణమ్మ, రమణి సత్యవేణి, బుజ్జి, తనూజ, రామలక్ష్మి, కష్ణవేణి, మధ్యాహ్న భోజన పథకం నాయకులు గూడూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో రావిచెట్టు వీధిలో జనసేన ఆధ్వర్యంలో జనవాణి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందని పలువురు రైతులు తమ సమస్యలను జనసేన నాయకులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొట శేషు, ఉపాధ్యక్షుడు గణేష్, నాయకులు మరిసా కాటాలు, సోషల్ మీడియా నిర్వాహకుడు జెర్రిపోతుల చిన్నంనాయుడు, నాయకులు కంటంరెడ్డి బుజ్జి, తోకల చిన్నారావు, యన్నంశెట్టి రమణ, మరిసా సూరిదేముడు పాల్గొన్నారు.

వైసిపి పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా బొబ్బిలి లక్ష్మణ్

బొబ్బిలి లక్ష్మణ్

ప్రజాశక్తి - జికెవీధి: వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా జికె వీధి మాజీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నట్లు వైసిసి కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా బొబ్బిలి లక్ష్మణ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా వైసిపి అధ్యక్షులు స్థానిక శాసనసభ్యులు మత్యారస విశ్వేశ్వరరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం : రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడులో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామిపరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో రామకృష్ణమఠం మలేషియా అధ్యక్షులు స్వామి సుప్రియనంద జీ మహారాజ్, రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయనందజీ మహారాజ్ పాల్గొని వైద్యశిబిరాన్ని పరిశీలించారు. వైద్యశిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొని సుమారు 150మందికి వైద్యసేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో రామాలయం వద్ద ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచిస్పందన లభించింది. నేత్ర వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ గోంప వెంకటరావు ప్రారంభించారు. 62 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఎంతో మేలు

ప్రజాశక్తి - జికెవీధి : మహిళ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని జనసేన పార్టీ వంచుల పంచాయతీ అధ్యక్షులు కూడ మధుకుమార్ అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్నిటిని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన అన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఎంతోమంది మహిళలకు ఆర్థికంగా సామాజికంగా ఈ పథకం ద్వారా ఉపశమనం అని, విద్యార్థినిలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందిని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ప్రజాసంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయటానికి కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్పేసెస్ కళాశాల అధ్యాపకునికి అవార్డు

ప్రజాశక్తి- పాయకరావుపేట: : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి తాతయ్యనాయుడు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జిపి రాజశేఖర్ నుంచి ఆదివారం అవార్డు అందుకోవడంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆయనను ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసరుగా నియమించారన్నారు. తమ కళాశాల మేనేజ్మెంట్, విద్యార్థుల సహకారంతో గత విద్యా సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు.

డ్రగ్స్ తయారీ ఫార్మా కంపెనీలపై క్రిమినల్ చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి- అచ్యుతాపురం:అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో డ్రగ్స్ తయారు చేస్తున్న కంపెనీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సెజ్‌లోని ఒక ఫార్మా కంపెనీలో డ్రగ్స్ తయారు చేస్తున్నారన్న సమాచారంతో రెండు రోజులుగా నిర్వహించిన సోదాల వివరాలను బహిర్గతం చేయాలన్నారు. అనుమతుల్లేకుండా డ్రగ్స్ తయారుచేసిన కంపెనీ లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.